ప్రజాశక్తి

శుక్రవారం 6 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బయటపడుతున్న లారస్ డొల్లతనం

- సరిగాలేని పైపులైన్ నిర్వహణ, తనిఖీ
- ఐదుగురి ప్రాణాలు తీసిన యాజమాన్య నిర్లక్ష్యం
- మూడో యూనిట్‌లోని ఇతర బ్లాకుల పైపులైన్ల సేఫ్టీపై తనిఖీలు
- ఇతర యూనిట్ల భద్రతపైనా అనుమానాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ ఫార్మాలోని లారస్ ల్యాబ్ మూడో యూనిట్, ఆరో బ్లాక్‌లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికుల మృతికి యాజమాన్య తప్పిదాలే కారణంగా కనిపిస్తున్నాయి. లారస్ మూడో యూనిట్‌లో ప్రమాదం తరువాత యాజమాన్య అసలు నైజం బట్టబయలైంది. భద్రతపై శ్రద్ధ చూపలేదన్న విషయం బయటపడింది. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న పరిశ్రమగా ఇంతవరకు జరిగిన ప్రచారమంతా అబద్ధమేనని తేలిపోయింది. గతేడాది డిసెంబరు 26న లారస్ ల్యాబ్‌లో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు ఒకరోజు, కొద్ది రోజుల వ్యవధిలో మరో కార్మికుడు మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదాన్ని తక్కువచేసి చూపేందుకు, తమ తప్పేమీలేదని నమ్మించేందుకు యాజమాన్యం చేసిన ప్రయత్నాలేవీ ఫలించేలాలేవు. లారస్ ప్రమాదంపై కర్మాగారాల తనిఖీ అధికారులు నిర్వహించిన విచారణలో యాజమాన్య పొరపాట్లు ఒక్కొక్కటీ బయటపడుతున్నట్లు తెలిసింది. ఔషధ పౌడర్ శుద్ధికి ఉపయోగించే టొలీన్ లీకవడంతో స్థిర విద్యుత్ (స్టాటిక్ ఎలక్ట్రిసిటీ) ఉత్పత్తి జరిగాక ఒక్కసారిగా వ్యాపించిన మంటల్లో ఈ ప్రమాదం చోటుచేసుకుందని అప్పట్లోనే ప్రచారం జరిగింది. మంటలు అదుపు చేసేందుకు కార్మికులు పాలిథిన్ కవర్లు ఉపయోగించడంతో ఈ ప్రమాదం జరిగిందని యాజమాన్యం నమ్మబలికింది.

గత నెలలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు

లీకైన పైప్‌లైన్ తనిఖీ, నిర్వహణ సరిగాచేస్తే ఈ తరహా ప్రమాదం జరిగివుండేది కాదని నిపుణులు చెబుతున్నారు. రెండేళ్లకు ఒకసారి పైప్‌లైన్ తనిఖీ, ప్రతినెలా నిర్వహణ సరిగా జరగలేదని కర్మాగారాల తనిఖీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. రెండేళ్లలో పైప్‌లైన్ తనిఖీ చేసినట్లు ధ్రువీకరణపత్రం చూపలేకపోయినట్లు తెలిసింది. అలాగే పైపు నిర్వహణకు సంబంధించి రికార్డు సరిగాలేని విషయాన్ని అధికారులు గుర్తించినట్లు చెబుతున్నారు. పైప్‌లైన్ తనిఖీ, నిర్వహణ సక్రమంగా చేస్తే ఈ తరహా ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువని సీనియర్ కార్మికులు అంటున్నారు. తనిఖీ, నిర్వహణలో మిగతా 2లో..

వెంకటేశ్వర్లు పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కెఎం.శ్రీనివాసరావు తదితరులు

ఆదర్శనీయుడు.. వెంకటేశ్వర్లు

- సంతాప సభలో వక్తలు
- పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగింత

ప్రజాశక్తి-ఉక్కునగరం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు అందరికీ ఆదర్శనీయులని పలువురు వక్తలు కొనియాడారు. తన కుమారుడిని వామపక్ష ఉద్యమం వైపు నడిపించి సిఐటియులోనూ, సిపిఎంలోనూ పనిచేసే విధంగా ప్రోత్సహించారని తెలిపారు. వెంకటేశ్వర్లు సంతాప సభ గురువారం ఆయన ఇంటి వద్ద జరిగింది. కూర్మన్నపాలెంలోని యక్షిత అపార్టుమెంట్‌లో వెంకటేశ్వర్లు నివాసం ఉంటూ అందరితోనూ మంచి సంబంధాలు కలిగి ఉండేవారని అపార్టుమెంట్ వాసులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా సిఐటియు ఇచ్చిన అన్ని పిలుపుల్లోనూ వెంకటేశ్వర్లు భాగస్వాములయ్యారన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరుతూ నిర్వహించిన ర్యాలీలో వయసు సహకరించనప్పటికీ పూర్తిగా పాల్గొన్నారని తెలిపారు. వెంకటేశ్వర్లును మిగతా 2లో..

నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత

వార్త 3లో..

జిఓ 1 రద్దు కోరుతూ నిరసనలు

లోపలి పేజీల్లో..

'ఆదర్శ్' సొసైటీ మోసంపై దర్యాప్తు జరపాలి

వార్త 2లో..

తులసీరావు కుమారుడు ఆనంద్, కుమార్తె రమాకుమారిలను ఓదారుస్తున్న సిఎం జగన్

తులసీరావుకు కన్నీటి వీడ్కోలు

సిఎం జగన్ సహా పలువురు నేతలు హాజరు

వార్త మెయిన్‌లో..

644వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చేపట్టిన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నామని హెచ్ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 644వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం సాగుతోందని తెలిపారు. అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దిగి రాలేదన్నారు. పైగా స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరచడం కోసం ముడిసరుకు అందకుండా చేయడం, కొన్ని విభాగాలను పనిచేయకుండా నిలుపుదల చేయడం వంటి చర్యలకు కేంద్ర ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ మిగతా 2లో..

ఈ-వేలంతో..

విఎంఆర్‌డిఎకు లాభాలు

మాట్లాడుతున్న రవీంద్ర కుమార్, వేణుగోపాల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నగర పరిధిలోని విఎంఆర్‌డిఎ ఆధీనంలో ఉన్న ప్లాట్లలో 23 ప్లాట్ల అమ్మకం ద్వారా రూ.23 కోట్ల ఆదాయం లభించిందని విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర కుమార్, కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం సాయంత్రం విఎంఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ప్లాట్ల అమ్మకాలకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో మొట్టమొదటిసారిగా విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా ఈ - వేలం నిర్వహించామని పేర్కొన్నారు. 3వ తేదీన నిర్వహించిన వేలంలో 22 ప్లాట్లను అమ్మకానికి ఉంచగా అందులో 14 ప్లాట్లు అమ్మకమయ్యాయని, 4వ తేదీన 24 ప్లాట్లును ఉంచగా 9 ప్లాట్లు అమ్మకం జరిగిందని తెలిపారు. 3వ తేదీన జరిగిన అమ్మకాలలో రూ.14 కోట్లా 37 లక్షలా 76 వేలా 996 ఆదాయంరాగా 4వ తేదీ జరిగిన అమ్మకాలలో రూ.8 కోట్లా 75 లక్షలా 12 వేలు ఆదాయం వచ్చిందని వారు తెలిపారు. ఈ రెండు రోజులు జరిగిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బయటపడుతున్న లారస్ డొల్లతనం

పైప్‌లైన్ సామర్థ్యం, ఒత్తిడిని తట్టుకోగలిగిన శక్తి దానికేమేరకుందో, ఎక్కడ లీకవడానికి అవకాశముందో గుర్తించి సరిచేయవచ్చని చెబుతున్నారు. ఆ నిర్వహణ, తనిఖీ సరిగాలేకపోవడం వల్లే పైప్‌లైన్ లీకుకు దారితీసినట్లు ప్రచారం జరుగుతోంది. మంటలను నియంత్రించగలిగిన డ్రై కెమికల్ పౌడర్ (డిసిపి) అందుబాటులో లేదని తనిఖీల్లో తేలినట్లు తెలిసింది. మూడో యూనిట్‌లోని ఆరో బ్లాకులో జరిగిన ప్రమాదంతో ప్రస్తుతం ఈ బ్లాకులో పని నిలిపివేశారు. ఆరో బ్లాకులో పైప్‌లైన్ లీకేజీకి భద్రతా వైఫల్యం, నిర్వహణలో యాజమాన్య నిర్లక్ష్యం కన్పించడంతో, మూడో యూనిట్‌లోని ఇతర బ్లాకుల పైపులన్నింటినీ తనిఖీ చేయించి వాటి సామర్థ్య, పనితీరుపై ధ్రువీకరణపత్రం ఇవ్వాలని యాజమాన్యాన్ని సంబంధిత అధికారులు కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇతర బ్లాకుల్లోని పైపులైన్ల సేఫ్టీపై తనిఖీ జరుగుతోంది. కర్మాగారాల తనిఖీ అధికారుల విచారణలో యాజమాన్య తప్పిదాలు బయటపడటంతో మరికొద్ది రోజుల్లో తుది నివేదిక సిద్ధంచేసి యాజమాన్యంపై కేసు నమోదుచేయనున్నట్లు తెలిసింది. మూడో యూనిట్‌లో జరిగిన ప్రమాదంతో లారస్ ఇతర యూనిట్లలో సేఫ్టీ ఎలా ఉందన్న భయాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదర్శనీయుడు.. వెంకటేశ్వర్లు

ఆదర్శంగా తీసుకొని నేటి యువతను వామపక్ష ఉద్యమాల వైపు ప్రోత్సహించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు డిసి హెచ్.వెంకటేశ్వరరావు, ఎవి.సత్యనారాయణ, సూర్యనారాయణ, ప్రజాశక్తి విశాఖ బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా సమన్వయక కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెంకటేశ్వర్లు పార్థివదేహాన్ని ఆయన కుమారుడు కెఎం.శ్రీనివాసరావు ఆంధ్ర మెడికల్ కాలేజీకి దానం చేశారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు తదితరులు ఉన్నారు.

విఎంఆర్‌డిఎకు లాభాలు

ఈ - వేలంలో ఏడు ప్లాట్లకు సింగల్ బిడ్లు వచ్చాయని, దీనిపై విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎ.మల్లికార్జున నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు. అంతేకాకుండా ఈ - వేలంలో అమ్ముడుకాని 16 ప్లాట్లకు మరొకసారి వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఈ - వేలం ప్రక్రియ ద్వారా అమ్మిన ప్లాట్లలో ఊహించిన దానికన్నా రెట్టింపు లాభాలు వచ్చాయని తెలిపారు.

644వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

యాజమాన్యం పాల్పడుతున్నాయన్నారు. కేంద్రం దిగి వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరం ప్రాంతంలోని తృష్ణా మైదానంలో అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలతో భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత గ్రామాల్లో కూడా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరాహార దీక్షలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, డి.కనకరాజు, ఎస్.ప్రసాద్, బి.ఈశ్వరరావు, డి.నాగరాజు, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

నేత వస్త్రాలతో వైజాగ్ చేరిన 'అంతరన్'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : టాటా ట్రస్ట్స్ క్రాఫ్ట్ ఆధారిత జీవనోపాధి కార్యక్రమంలో అత్యంత కీలకమైన 'అంతరన్' అస్సాం, నాగాలాండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ (పామ్‌బీచ్)కు గురువారం విచ్చేసింది. ఇంక్యుబేషన్ సెంటర్ల విస్తరణ దిశగా చిరు వ్యాపారాల అభివృద్ధికి దోహదపడి, వస్త్ర ప్రోత్సాహకాలను ఇవ్వడంలో సహకారమే లక్ష్యంగా ఇది వచ్చింది. చేనేతకారులు ప్రత్యేకంగా తీర్చిదిద్దిన చేనేత చీరలు, వస్త్రాలు, దుప్పట్లతో పామ్ బీచ్‌లో ఈ నెల 7 నుంచి 8వ తేదీ వరకూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ ప్రదర్శన ఉంటుంది. చేనేతకారుల అభివృద్ధి కోసం అంతరన్ సంస్థ ప్రత్యేకంగా మార్కెటింగ్ డవలప్‌మెంట్‌లో కృషి చేస్తూ చిరు ఎంటర్‌ప్రెన్యూర్లను ఆకర్షిస్తోంది. దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో అస్సాంలోని కామ్రూప్, నల్బారి, నాగాలాండ్‌లోని దిమాపూర్, ఒడిశాలోని గోపాల్‌పూర్, మణియాబంధా, ఎపిలోని వెంకటగిరి వస్త్రాలతో సంక్రాంతి ముంగిట అంతరన్ సందడి చేయనుంది.

కుప్పంలో చంద్రబాబును అడ్డుకోవడం దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఆయన పర్యటించకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని, ఇది అప్రజాస్వామికమని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు రాజకీయ నేతలే కారణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబడి ఉండటానికి రాజకీయ నేతలే కారణమని, ఇక్కడి ప్రజల సమస్యలను వారు సరిగా పట్టించుకోలేదని ఉత్తరాంధ్ర పార్టీ కన్వీనర్ మెట్ట రామారావు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యాన గురువారం రామాటాకీస్ దగ్గరలో ఉన్న అంబేద్కర్ సమావేశ మందిరంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది.

నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

వీధుల్లో పర్యటిస్తున్న కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుందర విశాఖ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన కర్తవ్యమని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఫిషింగ్ హార్బర్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర సుందరీకరణకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని, రాబోయే రోజులలో నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉండనుందని తెలిపారు. అలాగే 2జి సదస్సులు, సమ్మిట్‌లు నేషనల్ ఈవెంట్లు జరుగుతాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని, ముఖ్యంగా బీచ్ రోడ్‌లో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్‌లు, ప్రజా మరుగుదొడ్ల శుభ్రత మొదలైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త జాలరిపేట మరుగుదొడ్ల ప్రాంతాలలో భవన నిర్మాణ వ్యర్థాలు ఎత్తించాలని, ఆ ప్రదేశంలో మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్‌జి.శాస్త్రి, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ వ్యాపార సంస్థ కాదు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే భూ సేకరణ
'ప్రజాశక్తి' కథనంపై అధికారుల వివరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పేదలందరికీ ఇళ్ల స్థలంలో విఎంఆర్‌డిఎ బడా వ్యాపారి' అనే శీర్షికన గురువారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై విఎంఆర్‌డిఎ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎస్టేట్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ వివరణ ఇస్తూ దిగువ విధంగా పేర్కొన్నారు.

'ప్రభుత్వం జిఒ నెంబరు 72 ద్వారా 2020 జనవరి 25న 'నవరత్నాలు -పేదలందరికీ ఇల్లు పథకం' కింద విశాఖ జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోనూ, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి మండలంలోనూ భూ సమీకరణ ద్వారా అతుకుబడి భూములను సమీకరించింది. పేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందజేసేందుకు ఉత్తర్వులు జారీచేంది. వాటి ప్రకారం డి పట్టాదారులకు ఒక ఎకరానికి 900 చదరపు గజాల చొప్పున అభివృద్ధి పరిచిన భూమి, ప్లాట్లను, లే అవుట్ అభివృద్ధి చేసేందుకు విఎంఆర్‌డిఎ ప్రణాళిక సిద్ధం చేసింది. అందుకుగాను 15 శాతం అభివృద్ధి పరిచిన భూమి, ప్లాట్లను పేదలందరికీ అందజేశాక కేటాయించాలి. లబ్ధిదారులైన పేదలకు ప్లాట్లు ఇచ్చేశాక ఇంకా అక్కడ ఏమీ ఉండనందున, పైగా మౌలిక వసతుల అభివృద్ధికి విఎంఆర్‌డిఎ సొంత వనరులతో ఖర్చులు, విఎంఆర్‌డిఎ పరిధిలో ఇతర ప్లాట్లలోనూ ఈ రకమైన ఖర్చులు సంస్థకు ఉన్నందున ఆయా లే అవుట్లలో ప్లాట్లు లేనందున 2022 అక్టోబర్ 15న జరిగిన విఎంఆర్‌డిఎ సమావేశంలో అథారిటీ ముందు ఈ అంశాన్ని ఉంచారు. అభివృద్ధి పరిచిన చోట్ల 15 శాతం విఎంఆర్‌డిఎ పొందే అవకాశం లేనందున విఎంఆర్‌డిఎకు రావాల్సిన ప్లాట్ల విలువకు సమానమైన ఖాళీ ప్రభుత్వ, భూములను సమీకరణ చేయడం, అతుకుబడి భూములను సంబంధిత జిల్లా కలెక్టర్ నుంచి స్వీకరణ నిమిత్తం ప్రభుత్వాన్ని కోరేందుకు తీర్మానం జరిగింది. ఆ తీర్మానం మేరకు ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నుంచి సమాన విలువగల ప్రభుత్వ, సమీకరణ చేసిన డి - పట్టా భూములను స్వీకరించి సదరు భూములతో ల్యాండ్ బ్యాంక్ నిర్వహించి అభివృద్ధి పరిచి తద్వారా వచ్చే ఆర్థిక వనరులను 'నవరత్నాలు-పేదలందరికీ ఇళు ్ల'కు అనుమతినివ్వడం జరిగింది. విఎంఆర్‌డిఎ వివిధ కార్యకలాపాల ద్వారా ఆర్థిక వనరులను సమీకరించి తన పరిధిలో ప్రజావసరాల నిమిత్తం అభివృద్ధి పనులకు, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు, పార్కుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తుందే తప్ప విఎంఆర్‌డిఎ వ్యాపార సంస్థ కాదు' అని తెలియజేశారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అవయవదానంపై అవగాహన పెంచేందుకు దేశ వ్యాప్తంగా 5,500 కిలోమీటర్ల పొడవున ఎడెల్ వైజ్ టోకియో లైఫ్ ఆధ్వర్యంలో అవగాహన యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సిఇఒ సుమిత్ రాయ్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవిత బీమా సంస్థగా ప్రజల ఆకాంక్షలను సురక్షితంగా ఉంచడాన్ని కర్తవ్యంగా భావిస్తూ ఈ యాత్రను మోహన్ ఫౌండేషన్ భాగస్వామ్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు వారాలపాటు తలపెట్టిన ఈ కార్యక్రమం హైదరాబాదులో ప్రారంభమైందన్నారు. ఈ యాత్ర దేశంలో 50 నగరాలగుండా సాగి ఈ నెల 22న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ముగుస్తుందన్నారు.

'యువశక్తి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈ నెల 12న మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంలో నిర్వహించబోయే యువశక్తి సభను విజయవంతం చేయాలని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం సాయంత్రం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న యువతకు భరోసానిచ్చే కార్యక్రమంగా దీన్ని తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రూపొందించారన్నారు. జనసేన చేస్తున్న కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

'ఆదర్శ్' సొసైటీ మోసంపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదర్శ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరిట విశాఖపట్నం, ఇతర ప్రాంతాలలో వేలాది మంది డిపాజిటర్లను మోసగించిన కంపెనీపై దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. అగ్రిగోల్డ్ నుంచి చేదు పాఠం నేర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి మోసగాళ్లను పట్టుకునేందుకు నిఘా వ్యవస్థను ఎందుకు రూపొందించలేదని ప్రశ్నించారు.

డిఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ. : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి గురువారం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని వెయిటింగ్ హాల్, రైల్వే కార్యాలయాలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, వాటర్ అవుట్‌లెట్లుతోపాటు స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వరుస ప్రమాదాల నేపథ్యంలో రైలు ఎక్కి, దిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. విశాఖపట్నం నుంచి దువ్వాడ వరకు 17015 విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి, ప్రయాణీకులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం - గ్రామీణాభివృద్ధిశాఖ
వాటర్‌షెడ్ WDC-PMKSY 2.0 - అనకాపల్లి

షార్ట్ టెండరు నోటసు

పని పేరు : WDC-PMKSY 2.0 నందు 14 వాటర్‌షెడ్‌లలో 68 సిమెంట్ బెంచీలు (3×5 అడుగల సైజు), 2 లెగ్స్, నేమ్ ప్లేట్, వాటర్ కలర్ కోటింగ్, లోడింగ్, అన్లోడింగ్, ఫిక్సింగ్ మరియు రవాణాతో కలుపుకొని **బుచ్చయ్యపేట మండలంలోని** 1.ఆర్.భీమవరం 2. చిట్టియ్యపాలెం 3. గున్నెంపూడి 4. మల్లం 5. పెదమెదీన, 6. పెదపూడి 7.ఆర్.శివరాంపురం 8.రాజం **గొలుగొండ మండలంలోని** 1.చోద్యం 2.గుండుపాల 3.పప్పుశెట్టిపాలెం 4. గొలుగొండ 5. కొంకసింగి 6. గాదంపాలెం వాటర్ షెడ్ గ్రామాలకు సరఫరా చేయుట కొరకు టెండర్లు కోరబడుచున్నవి.

1. టెండర్లు జారీ చేయు ప్రక్రియ ప్రారంభ తేదీ : 05-01-2023
2. బేట్ సమర్పించుటకు ఆఖరు తేది : 09-01-2023 సాయంత్రం 3 గం॥ వరకు
3. టెండర్స్ తెరుచు తేది మరియు సమయం : 10-01-2023 సాయంత్రం 4 గంటలకు
4. టెండర్స్ తెరుచు స్థలం : జాయింట్ కలెక్టర్, అనకాపల్లి వారి కార్యాయంనందు
5. వివరముల కొరకు సంప్రదించవలసిన మొబైల్ నెం. **8332876013**

ఎడిషనల్ డి.ఆర్.పి. వాటర్ షెడ్, డుమా కార్యాలయం, అనకాపల్లి

1.టెండరు షెడ్యూలు కొరకు రూ. 500/-లు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో నీటి యాజమాన్య సంస్థ-అనకాపల్లి కార్యాలయం నందు అందజేసి టెండరు షెడ్యూలు పొందవలెను. 2. టెండరు షెడ్యూలు సొమ్ము తిరిగి చెల్లించబడదు. 3. టెండర్లు నిర్వహణపై జాయింట్ కలెక్టరు అనకాపల్లి వారికి పూర్తి హక్కులు గలవని తెలియజేయడమైనది. 4.టెండర్లు ఆహ్వానించు అధికారి ఏ ఒక్క టెండరు అయినా లేక అన్ని టెండర్లు అయినా తిరస్కరించు అధికారం పొందియున్నారు.

సం/- జాయింట్ కలెక్టర్, అనకాపల్లి జిల్లా.

IN THE HONOURABLE COURT OF VI ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
IA: 136/2020 IN OS.NO 478/2015
BETWEEN :
K. Kumara Seetharama Chandra Raju & others
..plaintiffs/petitioners
AND
D.R Kiran & others
...Defendants/Respondents

NOTICE

R3) **CHADALAVADA RAVI CHANDRA,**
FATHERS NAME NOT KNOWN TO THE PETITIONERS HINDU, AGED ABOUT42 YEARS, C/0 GARIKINA NOOKA RAJU KAPULUPPADA VILLAGE , BHEEMILI MANDAL , VISAKHAPATNAM DISTRICT.

Please take notice that the above named petitioners filed the above I A : 136/2020 and the said matter stands posted to **30-01-2023** at **10:30am** for your appearance. On that day you are appear personally or through a duly instructed advocate before the honourable court, failing which the matter will be heard and determined in your absence as per law.

S.ARUNDEV
ADVOCATE
Mobile: 9848566903

ఆత్మహత్య కాదు.. హత్యే

ఏడేళ్ళ తరువాత వెలుగు చూసిన వైనం

నిందితుడే స్వయంగా లొంగిపోతేగానీ ఛేదించని పోలీసులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఏడేళ్ల క్రితం ముడసర్లోవ రిజర్వాయర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన మహిళది హత్యే నని ఇప్పుడు భయటపడింది. అప్పట్లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. ఏడేళ్ళ తరువాత నిందితుడే వచ్చి తానే ఆ హత్య చేసానంటూ స్వయంగా పోలీసులకు లొంగిపోవడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. నిందితుడు వచ్చి లొంగిపోయినంత వరకూ కేసును ఛేదించలేక పోవడంపై పోలీసుల పనితీరుపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ ఇమ్మాన్యుయేల్‌రాజు వెల్లడించారు. గోపాలపట్నం, చంద్రనగర్ మాన్సన్ ఎస్టేట్స్‌లో దాసరి దిల్లేశ్వరరావు (52), భార్య ధమయంతి, ఇద్దరు పిల్లలతో నివాసముండేవారు. దిల్లేశ్వరరావు ఆర్మీలో పనిచేసి విరమణ పొందాక సెయిల్ పోర్టు ట్రస్టులో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవారు. భార్య ధమయంతితో తరచూ గొడవలు ఉండేవి. సెక్యూరిటీ గార్డుగా పనిచేసే సమయంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన దాడి లక్ష్మి (48)తో పరిచయమైంది. 2016లో ప్లాట్ తీసుకున్న దిల్లేశ్వరరావు ఇంటి పనిచేసేందుకు భార్య దమయంతిని డబ్బులు అడిగారు. భార్య నిరాకరించడంతో ఆమె ఏటిఎం కార్డును తస్కరించాడు. తనకు పరిచయమైన లక్ష్మికి ఆ ఏటిఎం కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేయించాడు. దీనికి ప్రతిఫలంగా లక్ష్మికి కొంత సొమ్ము ఇచ్చేవాడు. డబ్బులు విత్‌డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ రావడంతో డిల్లేశ్వరరావును భార్య దమయంతి నిలదీసింది. ఆయన చెప్పకపోవడంతో దమయంతి బ్యాంకులో విచారించింది. ఏటిఎం కేంద్రంలో ఒక మహిళ డబ్బులు డ్రా చేసినట్లు సిసి ఫుటేజీలో కనబడింది. దీంతో ఆ మహిళ ఎవరు, ఆమెకు నీకు ఏమిటి సంబంధం అని పెద్దల సమక్షంలో దమయంతి పంచాయతీ పెట్టారు. వివాహేతర సంబంధం, ఏటిఎం కార్డు దొంగతనం బయట పడుతుందని దిల్లేశ్వరరావు ఆందోళనకు గురయ్యాడు. 2016 ఏప్రిల్ 7న సాయంత్రం సుమారు 7 గంటలకు ఆరిలోవలోని దాడి లక్ష్మికి ఫోన్ చేసి ఏటిఎం నుంచి డబ్బులు తీయాలని రప్పించాడు. బైకుపై ఎక్కించుకొని ముడసర్లోవ రిజర్వాయర్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి వెనుక నుంచి లక్ష్మి పీక నొక్కి చంపేశాడు. కాళ్ళు, చేతులు, మెడ తాళ్లతో కట్టేసి గన్నీ బ్యాగ్‌లో మూటగట్టి, మృతదేహం తేలకుండా ఉండేందుకు ఆ మూటకు పెద్ద రాయి కట్టేసి రిజర్వాయర్‌లో పడేశాడు. అప్పట్లో లక్ష్మి భర్త దాడి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. తర్వాత ఆ కేసును తాత్కాలికంగా మూసివేశారు. ఏడేళ్ల తరువాత బుధవారం నిందితుడు దిల్లేశ్వరరావు స్వయంగా వచ్చి అప్పట్లో తాను హత్య చేసిన ఉదంతాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులకు వివరించాడు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి దిల్లేశ్వరరావును రిమాండ్‌కు తరలించారు. గత కొన్నేళ్ళుగా భార్య, పిల్లలకు దిల్లేశ్వరరావు దూరంగా ఉంటున్నాడు. ఏడేళ్ల క్రితం చేసిన పాపమే తనకు భార్య, పిల్లల్ని దూరం చేసిందని పశ్చాత్తాపం చెంది లొంగి పోయినట్లు నిందితుడు చెప్పాడని పోలీసులు పేర్కొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు...

ప్రజాశక్తి -మధురవాడ : జీవిఎంసీ ఐదో వార్డు పరిధిలోని మారికివలస జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో రూ. లక్షలు వెచ్చించి జీవిఎంసీ నిర్మించిన పలు సముదాయాలు నిరుపయోగంగా మిగిలిపోయాయి. మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో 2012 ఫిబ్రవరిలో రూ.73లక్షలతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. కొనుగోలుదారులకు అనుకూలంగా ఉన్నా వ్యాపారులకు అనుకూలంగా లేదని వీటిని లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. పదేళ్లగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఈ సముదాయం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ సముదాయాన్ని ఆధునీకరించి నెలవారీ అద్దెల రూపంలో చిల్లర వర్తకులకు, కూరగాయల చిరువ్యాపారులకు కేటాయిస్తే జీవిఎంసీకి ఆదాయం రావడమే కాకుండా చిరు వర్తకులకు, కొనుగోలుదారులకు ఉపయోగంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయం

జిఒ 1 రద్దు కోరుతూ నిరసనలు

పెందుర్తి కూడలిలో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో రోడ్డుషోలు, బహిరంగసభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒ 1 రద్దుచేయాలని కోరుతూ పలుచోట్ల టిడిపి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

పెందుర్తి : పెందుర్తి కూడలిలో టిడిపి నాయకులు నిరసనల తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ, చంద్రబాబు సభకు జనాలు అధిక సంఖ్యలో హాజరుకావడంతో చూసి ఓర్వలేక జగన్మోహన్‌రెడ్డి చీకటి జిఒలను తెచ్చారని విమర్శించారు. లోకేష్‌ను హేళన చేసిన వైసిపి నాయకులు ఆయన పాదయాత్రకు కూడా భయపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బల్లా శ్రీనివాసరావు, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు ఆధ్వర్యాన పెదగదిలి కూడలి వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. పెదగదిలి కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జిఒ పత్రాలను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, పోలారావు, యేడువాక సన్యాసిరావు, బాలరాజు, దువ్వి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబరు 1 అప్రజాస్వామికమైనదని సిపిఐ పేర్కొంది. ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మీడియాతో మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చట్టం విడుదల చేసి ప్రజాస్వామ్యాన్ని అణిచివేయాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒ ముఖ్యమంత్రికి వర్తించదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, జి.రాంబాబు, వై.రాంబాబు, ఎ.దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని ప్రకాశరావుపేట జివిఎంసి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు, వాటిని దిద్దే విధానాన్ని, ఎఫ్ఎ 2 పేపర్ల మూల్యాంకనం, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యా కానుకలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి నోటీసులు జారీ చేశారు. విద్యార్థుల గైర్హాజరు పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రధానాచార్యులు మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

నృసింహ దీక్షలు విరమణ

ప్రజాశక్తి-సింహాచలం: నృసింహ దీక్షలు చేపట్టిన భక్తులు గురువారం సింహాద్రి అప్పన్న ఆలయంలో దీక్షల విరమణ చేపట్టారు. దేవస్థానం అధికారులు అర్చకులు హోమగుండం ఏర్పాటుచేసి భక్తులు దీక్ష విరమణ చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ వర్మ, ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు, రమణమూర్తి, అలంకార్, కరి సీతారామాచార్యులు పాల్గొన్నారు.

గిడిజాలలో డెంగీ నమోదు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల గ్రామానికి చెందిన మజ్జి పావనికి కెజిహెచ్‌లో డెంగీ నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా అధికారి వై.మణి, వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాదియా గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సుమారు 150 గృహాలను సర్వే చేయగా వాటిలో దోమల లార్వా కేంద్రాలను గుర్తించి పరిశుభ్రత పనులు చేపట్టారు. జ్వర పీడితులను గుర్తించి వారి నుంచి రక్త పూతలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగం అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి పి.రామారావు, వైద్యఆరోగ్య సిబ్బంది పి.సాంబమూర్తి, నూకరాజు, టి.కల్యాణమ్మ, పి.సన్యాసిరావు, డి.దేవి, ఎస్.నరసింహమూర్తి, గంగా భవాని, ఆశ కార్యకర్త అనసూయ తదితరులు పాల్గొన్నారు.

'ఘాట్ రోడ్ సిబ్బంది అతి ప్రవర్తనతో ఇబ్బందులు'

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం భూ పరిరక్షణ విభాగం సిబ్బంది అతి ప్రవర్తనతో పంచ గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ఆవేదన వ్యక్తం చేశారు. ఘాట్ రోడ్డులో లోగీష వారి కుటుంబం ఇంటిముందు చిన్నపాటి గచ్చు వేసుకుంటే సిబ్బంది వచ్చి తవ్వేశారని, వారిని భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. చిన్న మరమ్మతులు చేసుకున్నా దేవస్థానం భూ పరిరక్షణ విభాగం అధికారులు వచ్చి ధ్వంసం చేస్తుంటే ఈ ప్రాంత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : 27వ ఇండియన్ నేషనల్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ ఛాంపియన్షిప్ (2022-23) పోటీలు ఉక్కునగరంలోని ఆంధ్ర కేసరి కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అండి బోయిన అప్పారావు, మరల భాస్కరరావు ఆధ్వర్యాన 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

7న గవర్నర్ రాక

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి బర్లపేటకు ఈ నెల 7వ తేదీన రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రానున్నారు. గ్రామంలో వికలాంగ బాలబాలికల ఉచిత విద్య శిక్షణ కేంద్రం, వృద్ధాశ్రమంతో పాటు యోగా సెంటర్ ఏర్పాటు నేపథ్యంలో భవన నిర్మాణాలకు భూమిపూజ చేయనున్నారు. దీని కోసం అధికారులు ముందుగా స్థల పరిశీలన చేస్తున్నారు. శ్రీ గాయత్రీ వెల్ఫేర్, కల్చరల్ యూత్ ఆకాడమీతో పాటు రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమత్తులు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పద్మనాభం సబ్‌స్టేషన్ ఎఇ ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. బోని సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం, పాండ్రంగి, మునివానిపాలెం, అనంతవరం, గంధవరం. కెజి.పెంట, దేవరపాలెం, బోని, రౌతులపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టిడిపి ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-పద్మనాభం : నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తాను ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని పద్మనాభం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ డిమాండ్‌చేశారు. టిడిపి ప్రముఖ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను చిన్నాపురం జంక్షన్‌లోనూ, తన సొంత గ్రామమైన బి.తాళ్లవలసలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను వైసిపికి చెందిన పి.రాజారావు, పి.జగన్నాథం, చందక గౌరి, ఎస్.ఈశ్వరావు, గెద్ద సురేష్, కళ్యాణపు గణేష్, చందక మురళి, సిహెచ్.పైడినాయుడు, బి.వెంకటేశ్వరావు, చందక పైడినాయుడు చింపివేసినట్లు పద్మనాభం సిఐ సన్యాసినాయుడుకు ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల తత్కాల్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : సార్వత్రిక విద్యాపీఠం 2022 - 23 విద్యా సంవత్సరానికి పదోతరగతి, ఇంటర్ ప్రవేశాలకు తత్కాల్ గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశం కోసం ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 8వ తేదీలోగా ప్రవేశ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుముతో పాటు పదవ తరగతికి రూ.400, ఇంటర్‌కు రూ.500 అదనంగా చెల్లించాలని తెలిపారు.

స్కైప్ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి-ఆనందపురం : జమ్మూ కాశ్మీర్‌లో గత నెల 31వ తేదీన స్కైప్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఆనందపురం మండలం మిందివానిపాలెం గ్రామానికి చెందిన నాగిశెట్టి జ్ఞానవర్ధన్ అండర్ 14 విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. నేపాల్‌లో జరిగే క్రీడలకు కూడా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జ్ఞానవర్ధన్‌ను గురువారం గ్రామ సర్పంచ్ లెంక రాంబాబు, హైస్కూల్ కమిటీ చైర్మన్ బొద్దపు బంగారరాజు, ఉప సర్పంచ్ జి.స్వామినాయుడు, ఎంపిటిసి సభ్యులు పల్లా రమణ, స్కై మార్షల్ ఆర్ట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆబోతు అప్పలరాము, సెక్రటరీ, కోచ్ లెంక అప్పలరాము, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు రౌతు శ్రీను, ఎంపిటిసి మాజీ సభ్యులు కె.వెంకటరమణారావు, యువ నాయకులు బి.సంతోష్ అభినందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, పురాతనమైన స్కై మార్షల్ ఆర్ట్స్‌ను ప్రభుత్వం స్కూల్ గేమ్స్‌లో పెట్టడం మంచి సువర్ణ అవకాశమన్నారు.

క్వీన్ ఆఫ్ ఆర్ట్స్ పోటీల్లో గాయత్రి సత్తా

మధురవాడ : ఢిల్లీ వేదికగా 2022 డిసెంబరులో జరిగిన 'మిస్ అండ్ మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ ఆర్ట్స్-2022' పోటీల్లో తెలుగు అమ్మాయి చిన్నిపిల్లి గాయత్రి సత్తా చాటింది. ఎయిరో లామ్, ఫ్లెక్సిబాండ్ ఆధ్వర్యాన ఇండియా వైడ్ నిర్వహించిన సీజన్-5 పోటీలలో ఈస్ట్ జోన్ నుంచి విశాఖపట్నంనకు చెందిన చిన్నిపిల్లి గాయత్రి ప్రతిభ కనబర్చింది. సుమారు 200 మంది పాల్గొన్న ఈ పోటీల్లో 50 మందిని ఎంపిక చేయగా అందులో గాయత్రి అవార్డులను సొంతం చేసుకున్నారు.

కాల్వలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో కాల్వలు, రోడ్లు నిర్మించాలని కోరుతూ వార్డు వెల్ఫేర్ సెక్రటరీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు (విపత్తు శాఖ) శీరపు రామలక్ష్మి స్థానిక మహిళలతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. కాల్వలు, రోడ్లు లేక పోవడంతో వర్షం, వాడుక నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. రోడ్లు, కాల్వల నిర్మాణం తక్షణమే చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.

ఎపియు సౌత్‌జోన్ వీసీల సమావేశానికి ఎయు ఆతిథ్యం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనుంది. జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో ఎయు వేదికగా ఈ సమావేశాలు జరగనున్నాయి. వైస్‌చాన్సలర్ల సమావేశ నిర్వహణపై ఎయూ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం వివిధ కమిటీలతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమావేశమయ్యారు. సౌత్ ఇండియాలోని విశ్వవిద్యాలయాలకు చెందిన 150 మందికిపైగా ఉపకులపతులు ఈ సదస్సులో పాల్గొంటారని, వీరికి రెండు రోజులు ఎయు ఆతిథ్యం ఇస్తుందని వీసీ తెలిపారు. రెండు రోజుల సదస్సులో 'రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' అంశంపై సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సదస్సు నిర్వహణ సమన్వయకర్తలు ఆచార్య కె.రాంజీ, ఆచార్య బి.మోహన వెంకటరామ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : మూడున్నరేళ్ళ చిన్నారి ముఖంపై 2022 డిసెంబర్ 14న అగ్గి పుల్లతో చురకలు పెట్టిన ఘటనలో సీతంపేట కనకమ్మవారి వీధి అంగన్వాడీ కేంద్రం హెల్పర్ ఎస్‌కె.రేష్మా బేగమ్‌ను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి ఉత్తర్వులు జారీచేశారు. భవిష్యత్తులో ఇటువంటివి జరిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని అంగన్‌వాడీ వర్కర్ సత్యవతిని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పిల్లలను ప్రేమతో చూడాలి తప్ప వికృత చేష్టలకు పాల్పడరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హితవుపలికారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి వైవి.అనురాధ అన్నారు. పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, డెమొక్రసీలో పరిస్థితులను బట్టి ప్రజల్లో మార్పులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ప్రయత్నం చేద్దామనుకొని పరిస్థితుల ప్రభావం వల్ల వేరే మార్గంలో నడుస్తారని తెలిపారు. ఒక లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని నడవాలని చెప్పారు.. గ్రంథాలయం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధి ప్రసన్నకుమార్, గ్రంథాలయం అధ్యక్షులు డాక్టర్ విజయ్‌కుమార్, కార్యదర్శి డిఎస్.వర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

పోర్టు మైదానంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం సమీపంలోని పోర్టు మైదానములో గురువారం వైజాగ్ జర్నలిస్ట్ ఫోరమ్ సభ్యులకు ఎబి గ్రూప్, ఒఎస్‌జి ఫౌండేషన్, విబి హ్యూమానిటీ ఫౌండేషన్ సౌజన్యంతో వెంకోజీపాలెం మెడికవర్ హాస్పిటల్, శంకర్ మఠం రోడ్డులోని వీ డెంటల్, విజన్ ట్రీ ఐ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎబి గ్రూప్ చైర్మన్ ఎం.స్వరూప్ ప్రారంభించారు. బిపి, సుగర్, గుండె, సంబంధిత వ్యాధులు, కేన్సర్ నిర్ధారణ, దంత పరీక్షలు జరిపారు. చాలా మందికి కంటి పరీక్ష చేశారు. అనంతరం స్వరూప్‌ను విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజెఎఫ్ ఉపాధ్యక్షులు నాగరాజు పట్నాయక్, వెబ్ జర్నలిస్ట్ యూనియన్, ఒఎస్‌జి ఫౌండేషన్, విబి హ్యూమానిటీ ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, శివ దళాయి, వెంకట్, భార్గవ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

7న జూనియర్ సివిల్ జడ్జి ఎంపికకు స్క్రీనింగ్

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : జూనియర్ సివిల్ జడ్జి ఎంపికకు ఈ నెల 7వ తేదీ నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాల్‌టికెట్‌లో సూచించిన విధంగా గుర్తింపు కార్డును తీసుకొని రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి 15 నిమిషాల ముందే హాజరుకావాలని తెలిపారు. గేట్లు మూసివేసిన తర్వాత వచ్చిన అభ్యర్థులను అనుమతించబోమని పేర్కొన్నారు.

9న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐటిఐ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్ చేయని వారి కోసం ప్రభుత్వ పాత ఐటిఐ కళాశాల ఆవరణలో ఈ నెల 9న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్, జోన్ 1 ఉపసంచాలకులు ఆర్‌వి.రమణ తెలిపారు. ఐటిఐ అన్ని ట్రేడ్ల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎపిఐఐడిసిఎల్‌తో పాటు 25కి పైగా ప్రైవేట్ కంపెనీలు అప్రెంటిస్ అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 9వ తేదీ ఉదయం 9 గంటలకు బయోడేటా, అర్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. https://dgt.gov.in/appmela2022 ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

చోరీల నివారణకు జాగ్రత్తలు : క్రైం సిఐ

ప్రజాశక్తి- కంచరపాలెం: చోరీల నివారణకు ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వెస్ట్ క్రైమ్ సిఐ దుర్గాప్రసాద్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు కంచరపాలెంలోని సిద్ధార్థనగర్‌లో గురువారం ఉదయం నేరాల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ సమయంలో ఊరెళ్లేవారు విలువైన బంగారం, వెండి, నగదును బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని చెప్పారు. ఊర్లు వెళ్లే వారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు వీలుంటుందని తెలిపారు. వీలైతే ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకొని దానిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసుకోవాలన్నారు. పండుగ వేళ అనేక ఆఫర్లతో ఫోన్లకు మెసేజ్‌లు వస్తాయని, వాటిని క్లిక్ చేయొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సునీల్, క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రికెట్ పోటీలో పాల్గొన్న ప్రజాశక్తి టీమ్

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్ ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం నుంచి మెగా క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్టు మైదానంలో ప్రారంభమైన ఈ పోటీలకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వాలుదేనన్నారు. జర్నలిస్టులకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఈ నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు జర్నలిస్టుల క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఇండోర్ పోటీలు పూర్తయ్యాయని, అవుట్‌డోర్ పోటీలు జరుగుతాయని చెప్పారు.

అనంతరం క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత ప్రజాశక్తి పత్రిక టీమ్ బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 15 ఓవర్లకు 86 పరుగులు చేసింది. అనంతరం లోకల్ చానల్స్ బ్యాటింగ్‌కు దిగింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో లోకల్ చానల్స్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో విజెఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజుపట్నాయక్, మైత్రీ మీడియా అధినేత అవనాపు విక్రమ్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా శంకర్‌బాబు, భాస్కర్, రామ్, విజెఎఫ్ కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, డి.గిరిబాబు, ఎమ్మెస్సార్ ప్రసాదు, పైల దివాకర్, శేఖర మంత్రి, ప్రజాపిత బ్రహ్మకుమారి రామేశ్వరి పాల్గొన్నారు.

తులసీరావుకు నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పట్ల పలువురు నివాళులర్పించారు.

ములగాడ : గాజువాక డిపో సమీపంలోని యాదవ సామాజిక భవనంలో తులసీరావు చిత్రపటానికి 59వ వార్డు వైసిపి అధ్యక్షులు పుర్రె సురేష్ యాదవ్, వార్డు ఇన్‌చార్జి రేవళ్ల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు యలమంచిలి వెళ్లి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పొట్టి మూర్తి, మీసాల పెంటారావు, అప్పారావు, రాజు, గంగపాము శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : యలమంచిలిలో తులసీరావు పార్థివదేహాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సందర్శించి నివాళులర్పించారు. తులసీరావు కుటుంబీకులు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కటుమూరి సతీష్, కటారి అనీల్‌కుమార్ రాజు, అంబటి శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ జర్నలిస్టుల ఫోరం కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించిన ఎస్.దుర్గారావు, శ్రీదేవి ఛానెల్ అధినేత రామకృష్ణంరాజు, బిజెపి నాయకుడు పీవీ చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసిరావు, మృతి పట్ల జర్నలిస్టులంతా సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పద్మనాభం : మండలంలోని మద్ది బల్క్‌కూలర్ పరిధిలో ఉన్న అన్నంరాజుపేట, బోని, మద్ది, అనంతవరం, కొవ్వాడ తదితర గ్రామాల నుంచి పాడి రైతులు యలమంచిలి వెళ్లి తులసీరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. అనంతవరం పాలసంఘం అధ్యక్షులు గోర్రిపాటి పెద్దఅప్పారినాయుడు, అనంరాజుపేట పాలసంఘం అధ్యక్షులు ఎన్నింటి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ

పింఛన్లు పంపిణీచేస్తున్న దాసరి రాజు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లతోపాటు వృద్ధులకు, వికలాంగుల పెన్షన్లను గురువారం 93వ వార్డు వైసిపి నాయకులు దాసరి రాజు, సచివాలయ అడ్మిన్ భారతి, వెల్ఫేర్ అధికారి లావణ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుకుంటూ పోతున్నారని తెలిపారు. బడుగు బలహీన వర్గాలను అన్ని విధాలా ఆదుకుంటున్న జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సంపత్, వినోద్, కిషోర్, జిలాని పాల్గొన్నారు.

ఆనందపురం : వేములవలస పంచాయతీలో నూతనంగా మంజూరైన 11 పింఛన్లను పంచాయతీ కార్యదర్శి పి.నరసింగరావు ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు కోరాడ మంగలత, పతివాడ పుష్పలత, వైసిపి నాయకులు కోరాడ అప్పలస్వామి నాయుడు, సర్పంచ్ లంక కొండమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులో నూతనంగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు పంపిణీ చేశారు. వార్డుకు కొత్తగా 45 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోడూరు సత్యనారాయణ, వల్ల శ్రీనివాస్, రాజకుమారి, గురి నీలిమ, ప్రవీణ్‌వర్మ, అరుణ బోగలింగేశ్వరరావు, తులసీరాం పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రామకృష్ణనగర్‌లోని శ్రీ షిరిడీ సాయి ధ్యాన మందిరంలో కమిటీ సభ్యుల సమక్షంలో పేదలకు అన్న దానం నిర్వహించారు. సుమారు 300 మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొడ్డేటి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు తోటపల్లి శ్రీనివాసరావు, ప్రగడ జగన్నాధరావు, కనకరాజు, పొలమరశెట్టి రాము పాల్గొన్నారు.

7న ప్రత్యేక సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సిరిపురం : గీత్ సంగీత్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీన ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎయు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన చాంబర్‌లో విడుదలచేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఈ నెల 7న సాయంత్రం 5.45 గంటలకు ఎయూ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో గువ్వలా ఎగిరిపోవాలి శీర్షికన ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ కీ బోర్డు ఆర్టిస్ట్ చిప్పాడ సోమేష్‌ను ఆత్మీయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. ఈటీవీ స్వరాభిషేకం గాయకుడు భాస్కర్, సంగీత దర్శకుడు ఉదయ్ కుమార్ గీతాలు ఆలపిస్తారని తెలిపారు. ప్రవేశం ఉచితమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా సంఘాల ప్రతినిధులు కొణతాల రాజు, ఆధ్యాత్మికవేత్త ఎస్.ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, శైలజామెరాజ్, పేరి గీత పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగులకు కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐలో గల నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో స్కిల్ హబ్ ద్వారా రెండు నెలల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చి, ప్రయివేట్ సంస్థలలో ఉద్యోగం కల్పించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు 9908799126 నెంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు

ఎఫ్‌బిఎస్ ఎన్నికల్లో నలుగురు పోటీ

ప్రజాశక్తి -గాజువాక : భెల్ విశాఖ యూనిట్‌లో ఈ నెల 11వ తేదీన జరిగే ఎఫ్‌బిఎస్ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉద్యోగులు రెండు ఓట్లు వేసి ఇద్దరిని గెలిపించాల్సి ఉంది. సిఐటియు, ఐఎన్‌టియుసి ఉమ్మడి ప్యానల్ నుంచి ఇద్దరు, యునైటెడ్ ఫ్రంట్ ప్యానల్ నుంచి ఇద్దరు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో 408 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

7న సృష్టి స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని సృష్టి వరల్డ్ స్కూల్‌లో 28వ వార్షికోత్సవాన్ని డిజిటల్ సమ్మిట్-2023 పేరుతో నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ సుశీలారాణి తెలిపారు. 7వ తేదీన 'రెడీనెస్ ఫర్ ద ఫ్యూచర్ టెక్నాలజీ జాబ్ మార్కెట్స్' థీమ్‌తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసామన్నామని పేర్కొన్నారు.

జిఒ 1 కాపీలు దగ్ధం

- అడ్డుకున్న పోలీసులు
-ప్రతిఘటించిన సిపిఎం నాయకులు

జిఒ 1 కాపీల దగ్ధాన్ని అడ్డుకుంటున్న పోలీసు

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్లపై సభలు, సమావేశాలు, రోడ్ షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 1ను నిరసిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన గురువారం స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో జిఒ కాపీలను దగ్ధం చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకొని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, సిపిఎం నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరికి సిపిఎం నాయకులు పోలీసు చర్యలను ప్రతిఘటించి జిఒ 1 కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెలబుచ్చే అవకాశం ఉందన్నారు. వీటిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రజల హక్కులపై దాడి చేసే ఈ జిఒ 1ను తక్షణమే వెనక్కు తీసుకోకపోతే పోరాటాలకు వెనుకాడమని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ నెహ్రూ చౌక్ జంక్షన్‌లోనే గతంలో జగన్మోహన్ రెడ్డి లక్షలాది మందితో సభ నిర్వహించడం గుర్తుకు లేదా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు చేస్తే చంద్రబాబుకు పట్టిన గతే జగన్మోహన్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి జిఒలు జారీ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి శ్రీనివాసరావు, తెలయ్య బాబు, సుభాషిణి, ఉమామహేశ్వరరావు, నూక అప్పారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

కె.కోటపాడు : జీవో నెంబర్ వన్ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సిపిఎం మండల నాయకులు రొంగలి ముత్యాల నాయుడు, ఎర్ర దేవుడు పేర్కొన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి తప్పుడు జీవోలు తీసుకొచ్చి ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు రోడ్లపైనే ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించి ముఖ్యమంత్రి అయిన విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

కొత్త పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు, గ్రంథాలయాధికారి

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు మంజూరయ్యాయి. వాటిని గురువారం ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.వి.రమణ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి, కార్యదర్శి ఆర్‌సి హెచ్ వెంకటరావు సహకారంతో స్థానిక శాఖ గ్రంథాలయానికి 888 పుస్తకాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిలో తెలుగు 779, ఇంగ్లీష్ 92, హిందీ16, ఇతర పుస్తకం ఒకటి ఉన్నాయని, వాటిలో కథలు, రామాయణం, జీవిత చరిత్రలు, నవలలు, సైన్స్, మహాభారతం, దేశభక్తి గేయాలు, యోగకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పివిఎన్ మూర్తి మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.సత్యవతి వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ చేస్తున్న పెదబాబు తదితరులు

ఘనంగా మాజీ మంత్రి కొణతాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -అనకాపల్లి

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలు స్థానిక నిదానందొడ్డి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ సమీపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనకాపల్లి వర్తక సంఘం గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కొణతాల రామకృష్ణ మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, నాగులపల్లి సర్పంచ్ సింగర్ రాజు, కర్రి సత్యనారాయణ, కసింకోట మాజీ ఎంపీటీసీ దాడి నాగరాజు, మాజీ కౌన్సిలర్ మడగల శ్రీను, పీల నాగ శ్రీను, బొడ్డేడ బాలాజీ, బుద్ద రాజేష్, దొడ్డి నాగేశ్వరరావు, ప్రముఖ బెల్లం వర్తకులు కర్రి సన్యాసి రావు, అనకాపల్లి, మునగపాక, కసింకోట మండలాల కొణతాల రామకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

మాధవాచార్యుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా బ్రాహ్మణ, అర్చక పురోహిత సంఘం నాయకులు గోపినంబల మాధవాచార్యులు చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో గురువారం మాధవాచార్యుల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కనకదుర్గ ఆలయ ప్రధాన అర్చకులుగా, వాసవి అయ్యప్ప స్వామి ఆలయ అర్చకులుగా, పలు ఆలయాల నిర్మాణ నిర్వాహకుడిగా పనిచేసే ఎందరి మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స కృష్ణంరాజు, చదరం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సురేఖ, రత్నం, వెంకటలక్ష్మి, మణి, గోపి నంబాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

సొంత పార్టీపై వైసిపి కార్యకర్తల నిరసన

పార్టీ కార్యాలయానికి స్థలం మంజూరును నిలుపుదల చేయాలని డిమాండ్

సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న కెఎన్ఆర్.పేట గ్రామస్తులు

ప్రజాశక్తి -అనకాపల్లి

జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు నరసింహరావు పేట గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 75/3లో ఎకరా 75 సెంట్ల స్థలాన్ని వైసిపి కార్యాలయానికి మంజూరు చేస్తూ విడుదల చేసిన జీవోపై ఆ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. కొత్తూరు నర్సింగరావుపేట సచివాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టి సచివాలయ సూపరింటెండెంట్ షేక్ ఇస్మాయిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు మాట్లాడుతూ తమకు తెలియకుండానే తమ పార్టీ నేతలు తమ గ్రామంలోని స్థలాన్ని ఎలా పార్టీ కార్యాలయానికి కేటాయిస్తారని ప్రశ్నించారు. గ్రామ సామాజిక అవసరాలైన కళ్యాణ మండపం, పాఠశాల, వ్యాయామశాల, గ్రంథాలయం నిమిత్తం ఆ స్థలాన్ని ఉంచకోగా, ఒక రాజకీయ పార్టీకి కేటాయించడం తగదన్నారు. పార్టీ కోసం, పార్టీ గెలుపు కోసం కష్టించి పనిచేస్తున్న తమను నిర్లక్ష్యం చేసి తమకు తెలియకుండా ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ఆ ఉత్తర్వులను నిలుపుదల చేసి కార్యకర్తల మనోభావాలకు విలువనిచ్చి ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు జరగకుండా, అనుమతులు మంజూరు చేయకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలీన గ్రామాల వైసిపి ఇన్‌ఛార్జులు గొల్లవిల్లి నరసింగరావు, చెట్టోలు సత్య, కరణం సురేష్, గొల్లవిల్లి రమణ, పన్నీరు మహేష్, అరిగా అప్పారావు, చెట్టోలు దుర్గ ప్రసాద్, గొల్లవిల్లి జానకిరామ్, బల్లిన నాగు, మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, కోనేటి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాగార్జున తదితరులు

ప్రజాశక్తి - కశింకోట

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. మండలంలోని తాళ్లపాలెం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటలు పాటల్లో కూడా రాణించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చదువు కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి, జిల్లా గురుకుల పాఠశాల సమన్వయకర్త రూపావతి, ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

67వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి ఎనిమిది గ్రామాలకు చెందిన నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలో నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 67వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలకు పైగా ఉపాధి లేక అనేకమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తులో అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'గడప గడపకు'తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- చోడవరం : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని జుత్తాడ గ్రామంలో రెండు రోజుల పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు గురువారం పర్యటన అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అందిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, ఎంపిడిఓ ఎస్‌డి హేమసుందర్, వైస్ ఎంపిపి గంగరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

మాట్లాడుతున్న ఆచార్య చిన్నయ్య సూరి

రాజ్యాంగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ ప్రాథమిక అవగాహన ఎంతో అవసరమని పలువురు వక్తలు తెలిపారు. మాజీ శాసనసభ్యులు కోడుగంటి గోవిందరావు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆచార్యులు కె.చిన్నయ్య సూరి, సూర్యనారాయణ, కె శ్రీనివాసులు, కె మురళి, వి అంజిరెడ్డి, ఎస్ సుమిత్ర తదితర వక్తలు మాట్లాడారు. హిందూ సంస్థల కోరల్లో రాజ్యాంగం బందీ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని రక్షించుకునేందుకు నేటి యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని మౌలిక నిర్మాణం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, పాశ్చాత్య ప్రపంచం అనే అంశాలను సోదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి జ్ఞాపికలతో సత్కరించారు.

చంద్రబాబు సభకు భద్రత కల్పనలో విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు సభలకు ప్రభుత్వం భద్రత ఏర్పాటు చేయడంలో విఫలమైందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. దానిని కప్పి పుచ్చుకునేందుకు జీవో నెంబర్ 1 వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిట్లర్, తుగ్లక్, గోబెల్స్‌కు ప్రతిరూపంగా జగన్ రెడ్డి నిలుస్తున్నారన్నారు. పాలకులను ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉందన్న సంగతి ముఖ్యమంత్రి మరిచిపోరాదన్నారు. అత్యంత దుర్మార్గమైన బ్రిటిష్ కాలం నాటి 1861 చట్టం ద్వారా సభలు, సమావేశాలు, నిరసనలు రోడ్లపై నిర్వహించరాదని చెప్పడం అత్యంత దుర్మార్గమన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్య మనుగడకు పెను ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. అత్యంత అరుదైన సందర్భాల్లో షరతులతో అనుమతి ఇవ్వచ్చని పోలీస్ వ్యవస్థకు కట్టబెట్టడం పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతను సైతం ప్రశ్నార్థకంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యంపై విలువ ఉంటే తక్షణమే ఈ జీవోను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు.

పిహెచ్‌సిలో అధునాతన పరికరాలు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి పిహెచ్‌సిలో కొత్తగా మంజూరైన అధునాతన ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్లను ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త పరికరాల వల్ల రోగులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండారు మంగ శ్రీను, యడ్ల నాయుడు, డాక్టర్ ఎం.వెంకట రమణ, డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది జోగిరాజు, అనిత, శ్రీనివాసరావు, నర్సింగరావు, సత్యవతి, వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల్లో జోష్

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ నిర్వహించిన కాఫీ విత్ కేడర్ కార్యక్రమంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రేకెత్తింది. మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైసిపి అవినీతిపై సమిష్టిగా పోరాడేందుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జోగా భాను, చిన్ని నాయుడు, శీర అప్పారావు, శీర రాజు, సేనాపతి బుజ్జి, పి శ్రీను, గమిల శ్రీను, అనకాపల్లి శ్రీను, సూరిశెట్టి తులసి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహ లబ్ధిదారులకు ఉపాధి పనులు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలంలో జగనన్న హౌసింగ్ కోలనీ లబ్ధిదారులకు 90 రోజుల పాటు ఉపాధి హామీ పనులు కల్పించడం జరుగుతుందని ఎంపిడిఒ కొంకి అప్పారావు తెలిపారు. కశింకోటలో జగనన్న హౌసింగ్ కాలనీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి జాబ్ కార్డు జారీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ శివ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

స్మైలెక్స్ లేబొరేటరీస్‌లో కార్మికుడు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- కంపెనీ గేట్ ముందు ఆందోళన

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ లేబొరేటరీస్ లిమిటెడ్ యూనిట్-4లో ఐరన్ ఫోల్‌పై నుండి పడి కార్మికుడు మేడిశెట్టి పైడిరాజు (38) అక్కడికక్కడే మృతి చెందారు. మరో కార్మికుడు ఓనుం అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. జివిఎంసి 77వ వార్డు అప్పికొండ శివారు మురుబాయి గ్రామానికి చెందిన మేడిశెట్టి పైడిరాజు, ఓనుం అప్పారావు రెండు నెలల నుండి స్మైలెక్స్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీలో పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం కూడా కంపెనీలోని 25 అడుగుల ఐరన్ పైపుకు పెయింటింగ్ పనులు చేస్తూ ఉండగా సేఫ్టీ బెల్ట్‌కు కట్టిన తాడు తెగిపోవడంతో 25 అడుగుల పైనుండి కిందపడిపోవడంతో పైడిరాజు అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడ ఉన్న మరో కార్మికుడు అప్పారావు కూడా కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పైడిరాజు మృతదేహాన్ని విశాఖ కేజీ హేచ్ కు తరలించారు. దీనిపై పరవాడ సిఐ పి.ఈశ్వరరావును వివరణ కోరగా తమకు ఎవరు ఎటువంటి ఫిర్యాదులు చేయలేదని, దీంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

స్మైలెక్స్ కంపెనీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, సిఐటియు నాయకులు గనిశెట్టి తదితరులు

పైడిరాజు (ఫైల్‌ఫోటో)

కంపెనీ గేట్ ముందు ఆందోళన

ప్రమాదం విషయం తెలిసిన గ్రామస్తులు కుటుంబీకులతో కంపెనీ గేటు వద్దకొచ్చి ఆందోళన చేశారు. ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ వారికి సంఘీభావం తెలిపారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని, క్షతగాత్రునికి మెరుగైన వైద్యం, నష్టపరిహారం అందించాలని కోరారు.

టిడిపి హయాంలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

జిఒ నెంబర్ 1 కాపీలను దగ్ధం చేస్తున్న గవిరెడ్డి, టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి సాధించిందని మాడుగుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. బుధవారం మండలంలోని తామరబ్బా పంచాయతీ శివారు బొడ్డపాడు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం రోడ్లపై సభలు, ర్యాలీలు, రోడ్ షోలు నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1 కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, టిడిపి నాయకులు శెరకాన సూర్యనారాయణ, బండారు సింహాద్రప్పుడు, మలిరెడ్డి రాజునాయుడు, రాయివరపు సాంబమూర్తి, జడ్డేటి పైడిరాజు, ముసలి తమ్మయ్య, ముక్త ఈశ్వరరావు, వంతు నాయుడు, కిల్లి గోవింద, గొంతిన అప్పలనాయుడు, మహిళలు పాల్గొన్నారు.

కశింకోట : వైసిపి పాలనలో రాష్ట్రంలో గ్రామాలన్నీ అంధకారంలోకి వెళ్ళిపోయాయని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. కశింకోటలో రెండో రోజు గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కశింకోట గ్రామంలో వీధి దీపాలు వెలగకపోయిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకే సభలకు అనుమతుల రద్దు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, కాంద్రేగుల సతీష్, జగన్నాధం, పంచదార్ల సూరిబాబు, బొడ్డేడ బాలాజి, షేక్ బాబర్ పాల్గొన్నారు.

జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5న అనకాపల్లి జిల్లా ఓటర్ల తుది జాబితాను విడుదల చేసినట్టు కలెక్టర్ రవి పఠాన్ శెట్టి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో మొత్తం 1,526 పోలింగ్ కేంద్రాల్లో పురుష ఓటర్లు 6,28,740, మహిళా ఓటర్లు 6,55,716 మంది, థర్డ్ జండర్ 62 మంది వెరసి 12,85,518 మంది ఉన్నారు. గత ఏడాది నవంబర్ 9న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా కంటే 15,618 మంది ఓటర్లు పెరిగారు. అనకాపల్లి నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాల్లో పురుష ఓటర్లు 1,02,893, మహిళలు 1,08,709, థర్డ్ జెండర్ ఏడుగురు కలిపి 2,11,609 మంది ఓట్లు ఉన్నారు. చోడవరం నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల్లో పురుష ఓటర్లు 1,05,037, మహిళలు 1,10,655, థర్డ్ జండర్ 12 కలిపి 2,15,704 మంది ఉన్నారు. మాడుగులలోని 235 కేంద్రాల్లో పురుషులు 93,679, స్త్రీలు 97,618, థర్డ్ జెండర్ 6 కలిపి 1,91,303 మంది, ఎలమంచిలి నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు 1,00,438, స్త్రీలు 1,04,389, థర్డ్ జెండర్ 19 కలిపి 2,04,846 మంది ఉన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 292 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు 1,22,418, స్త్రీలు 1,24,692, థర్డ్ జెండర్ రెండు కలిపి 2,47,112 మంది, నర్సీపట్నం నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాల్లో పురుషులు 1,04, 275, స్త్రీలు 1,09,653, థర్డ్ జెండర్ 16 కలిపి 2,13,944 మంది ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

కోవిడ్‌పై ముందస్తు చర్యలకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : కోవిడ్ కోవిడ్ ఒమిక్రాన్ ఎక్స్‌బిబి వైరస్ బారిన పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ వైరస్ ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొట్టా చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూది కొండ మాణిక్యాలరావు, ఆడారి బుచ్చి రాము, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవింద, ముగడ అప్పారావు, పల్లా సత్య అప్పారావు, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- మునగపాక రూరల్

సమస్యలు పరిష్కరించే దిశగా గ్రామపంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. స్థానిక పంచాయతీ ఆవరణలో గురువారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం, గ్రామ అభివృద్ధిపై గ్రామసభ నిర్వహించినట్లు చెప్పారు. గ్రామంలో వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ప్రతి వీధిలో సిమెంట్ రహదారులు ఏర్పాటు, పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే దిశగా ఎప్పటికప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎంపీడీవో రవికుమార్ పెన్షన్ మంజూరు వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, కార్యదర్శి అజయ్ బాబు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొగలిపురంలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని మొగలిపురంలో కొత్త పింఛన్లను గురువారం వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, ఎంపిపి బోకం సూర్యకుమారి, రామునాయుడు మాట్లాడుతూ కొత్తగా 13 మందికి వితంతు, వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు బైజుస్ ట్యాబ్స్ పంపిణీ చేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న 10 మందికి ఉచితంగా కరెంట్ మీటర్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైపిపి నాయకులు కొటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, ఐడి బాబు, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, గండి బండియ్య, పైల రామునాయుడు, సిరపరపు నవీన్, బత్తిన వెంకట్, ఐ.గోపి, పంచాయతీ సెక్రటరీ పాపాన సంతోషి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, పించన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పులి దాడిలో
మృతి చెందిన పశువులకు నష్టపరిహారం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం పంచాయతీ ద్వారకా నగర్‌లో 2022లో పులి దాడిలో మృతి చెందిన ఆవులకు, ఆవు పెయ్యలకు నష్టపరిహారాన్ని బాధిత రైతులకు పంపిణీ చేశారు. నష్ట పరిహారం కింద రూ.1.30 లక్షల చెక్కులను స్థానిక ఎంపీటీసీ రాపేటి అరుణ రాము, సర్పంచ్ చేతుల మీదుగా బాధిత రైతులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కషి చేసిన అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఇన్‌స్పెక్టర్ పీవీ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి గుణపాఠం తప్పదు

మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని గెడ్డపాలెం గ్రామంలో టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీరుతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. పెంచిన విద్యుత్ బిల్లులు, నిత్యావసరాల సరుకులపై దృష్టి పెట్టకుండా ప్రశ్నించిన వారి గొంతు నొక్కుతుందని విమర్శించారు. చంద్రబాబుకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక చీకటి జీవోలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని వైసిపి ప్రభుత్వ వైఖరితో ఇప్పటికే ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అని ప్రజలు అనుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి సరైన గుణపాఠం చెపుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనిత

జిఒ 1 రద్దు చేయాలి : అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: జిఒ 1ను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, బ్రిటిష్ కాలంలో ప్రజలను అణగదొక్కేం దుకు ఇటువంటి జీవోలు తెచ్చేవారన్నారు. తుగ్లక్ ముఖ్యమంత్రి జగన్ ఇటువంటి జీవోలు ఇవ్వడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలకు జనాలు రానందుకు భయపడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ సభలకు విపరీతంగా జనం వస్తున్నారని, దీన్ని చూసి భయపడుతున్నారా అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్ర జనవరి 27 నుండి ప్రారంభమవుతుందని, ప్రభుత్వం చేస్తున్న అరాచకాల ను, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్తారని భయపడుతున్నారా అని ప్రశ్నించారు.

సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: జనవరి నుండి మార్చి వరకు సదరం స్లాట్ ఓపెన్ అయ్యిందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెండ్ డాక్టర్ నీలవేణి దేవి తెలిపారు. ఈసారి స్లాట్ బుకింగ్‌లో కొన్ని కొత్త అప్డేట్స్ ఉంటాయని, కొత్తగా బుక్ చేసుకొనేవారు ఈ ఆప్షన్ ఉపయోగించాలన్నారు. కొన్ని సందర్భాల్లో రిజెక్ట్ అయినా టెంపరరీ సర్టిఫికేట్ మంజూరైన వారు అప్పీల్ 1 ద్వారా మళ్లీ అదే సదరం ఐడీతో కొత్త స్లాట్ పొందవచ్చు అన్నారు. ఆమె తెలిపిన మరిన్ని వివరాలు... అప్పీల్ ఒకటి, అప్పీల్ రెండులో కూడా రిజెక్ట్ అయితే అప్పీల్ 2 ద్వారా అప్లయ్ చేసుకోవచ్చు. అప్పీల్ 2 లో వచ్చే సర్టిఫికేట్ అంతిమంగా ఉంటుంది. అప్పీల్ 2 లో రిజెక్ట్ అయితే మళ్ళీ సదరం బుక్ చేసుకొనే అవకాశం ఉండదు. అప్పీల్ 1,2 వారికి హాస్పిటల్స్ రాండమ్ గా కేటాయించబడతాయని, సదరం డిలీట్‌కు ఇకపై కలెక్టరేట్‌లో స్పందన కు వెళ్ళవలసిన అవసరం లేదని, వికలాంగుల సౌకర్యంకు ప్రభుత్వం ఈ విధానాన్ని సచివాలయం ద్వారా అందుబాటులోకి తెస్తుందని తెలిపారు.

పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

సంపద తయారీ కేంద్రం పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని బంగారమ్మపేటలో సంపద తయారీ కేంద్ర నిర్మాణం పనులను గురువారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ పరిశీలించారు. మిగిలిన నిర్మాణం పనులను త్వరతగతిన పూర్తి చేసి సంపద తయారీ కేంద్రాన్ని వాడుకులోకి తీసుకు రావాలని సూచించారు. సంపద తయారీ కేంద్రం వాడుకలోకి వస్తే పంచాయతీకి ఆదాయం లభించడంతో పాటు, గ్రామ పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న మత్స్యకారులు

400వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 400వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 400 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్యకు పరిష్కారం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పైప్ లైన్‌కు అనుమతులు ఇవ్వబోమని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. .ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఇత్తడి సప్పరం వాహనంపై శ్రీనివాసుడు, చిన్న పల్లకిపై గోదాదేవి అమ్మవారు తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇంట ముంగిటికు వచ్చిన స్వామివారిని అనేక మంది భక్తులు దర్శించుకున్నారు. తిరువీధి సేవ అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ప్రసాదా చార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం గోపాల ఆచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు, ఆలయ అధికారులు సందీప్, టిటిడి విజిలెన్స్ రమణ పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న పురోహితులు

వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో వీధి దీపాలను సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని స్తంభాలకు బల్బులు వేయించడం జరిగిందన్నారు. చీకట్లో ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో బల్బులను వేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ పారదర్శకంగా అందించడమే తమ ధ్యేయమని తెలిపారు.

ఏర్పాటు చేస్తున్న లైటు

మాట్లాడుతున్న ఎంపిడిఒ

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-కోటవురట్ల:జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.సకాలంలో వారికి బిల్లులు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్, కిటికీలు అందజేయాలన్నారు. లబ్ధిదారులతో మొదలుపెట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ జగదీశ్వరరావు, ఈఓపిఆర్‌డి ప్రేమ కుమార్, పాల్గొన్నారు.

పాడి గేదె మృతి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత కృష్ణదేవిపేట గ్రామంలో గురువారం పాడి గేదె మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సూరిశెట్టి సత్తిబాబు రైతు ఎప్పటిలాగానే ఉదయం ఏడు గంటల ప్రాంతంలో గేదె నుండి పాలను తీశాడు. ఉన్నట్టుండి ఆ గేదెలో ఒక్కసారిగా వణుకు మొదలై తీవ్ర అస్వస్థతకు గురవుతూ అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందింది. పశు వైద్యాధికారిణి స్పందించి వెనువెంటనే వచ్చినా ఫలితం లేకపోయిందని రైతు వాపోయాడు. నిత్యం పాల నుండి వచ్చే ఆదాయంతో ఇంట్లో తిండి ఖర్చులకు సరిపోయేవని ఆవేదన చెందుతున్నాడు. మృతి చెందిన పాడి గేదె రూ.60వేలు విలువ చేస్తుందని, రైతుకు పరిహారం అందేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలను ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, ప్రపంచంలోని అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన అక్షరధాత, అపర మేధావి లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. ఎంతోమంది అంధులను విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, సంగీత కళాకారులుగా, ఉద్యోగులుగా అనేక రంగాల్లో బ్రెయిలీ లిపితో అగ్ర భాగాన నిలిచేటట్లు చేసిన వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని మేడివాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, దివ్యాంగ విద్యార్థులకు కలిపి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, విశ్వనాథం చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రం చార్టు స్వీకరిస్తున్న హెచ్‌ఎం

దర్శకుడు త్రినాధరావుకు సన్మానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ధమాకా మూవీ డైరెక్టర్ ఎం.త్రినాధరావు గురువారం నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ధమాకా మూవీ కేవలం 20 రోజుల్లోనే 100 కోట్లపైగా వసూలు అయ్యిందని, ఇంత పెద్ద హిట్ అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీశంకర దేవాంగుల సంఘం సభ్యులు డైరెక్టర్‌ను సత్కరించారు. చౌడేశ్వరి అమ్మవారి చిత్రపటాన్ని ఆయనకి అందించారు. త్వరలో మరో రెండు పెద్ద ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగుల సంఘం కార్యదర్శి జెట్టి శంకర్రావు, బూడిద గంగరాజు, ఎర్ర బాబ్జి, కోశాధికారి సాంబశివరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నను మర్యాదపూర్వకంగా కలిసిన త్రినాధరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును గురువారం ధమాకా సినిమా డైరెక్టర్ నక్కిన త్రినాధరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, అనకాపల్లికి చెందిన త్రినాధరావు సినీ రంగంలో డైరెక్టర్గా రాణించడం సంతోషంగా ఉందన్నారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన పూరీ జగన్నాధ్, గుణశేఖర్, పరశురాం వంటి వారు ఇప్పటికే టాలీవుడ్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నక్కిన త్రినాధరావు గుర్తిండిపోయేలా సినిమాలు తీశారన్నారు. రాజ్ తరుణ్ హీరోగా సినిమా చాపిస్తా మామా, నాని హీరోగా నేను లోకల్ వంటి చిత్రాలు అందించారని, తాజాగా రవితేజ హీరోగా ధమాకా చిత్రానికి దర్శకత్వం వ హించి మంచి విజయాన్ని దక్కించుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని చిత్రాలు తీసి మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.దమాకా చిత్ర భారీ విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో మైత్రి మూవీస్, దిల్ రాజు బ్యానర్లలో సినిమాలను తీస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తనయుడు చింతకాయలు రాజేష్, తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీ నర్ మల్ల సురేంద్ర, నక్కిన సురేష్, పీలా జగన్నాధరావు, మావూరి వెంకటేష్, సూర్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన డైరెక్టర్ త్రినాధరావు

మాట్లాడుతున్న నారాయణ

కేరళ గ్రంథాలయాలు ఆదర్శం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:కేరళ రాష్ట్రంలో గ్రంథాలయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని విశాఖ జిల్లా పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎల్ నారాయణ, కె.త్రిమూర్తులు కొనియాడారు. 2022 డిసెంబర్ 27 నుండి 2023 జనవరి మూడో తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కన్నూరు యూనివర్సిటీలో జరిగిన మొట్టమొదటి ఇండియన్ లైబ్రరీ కాంగ్రెస్‌లో ఆంధ్ర రాష్ట్రం నుండి వీరు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో విలేకరులతో త్రిమూర్తులు మాట్లాడుతూ, కన్నూరు జిల్లా గ్రామీణ ప్రాంతంలోని గ్రంథాలయాల నిర్వహణను చూసి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ గ్రంథాలయాలు ప్రజా సాంస్కృతిక కేంద్రాలుగా నడుస్తున్నాయన్నారు. వారం రోజుల పాటు జరిగిన లైబ్రరీ కాంగ్రెస్లో బుక్ ఫెస్ట్, లైబ్రెరియన్స్ మీట్, కల్చరల్ మీట్, వాకర్స్, స్టూడెంట్స్, మ్యూజికల్ మీట్స్ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారన్నారు. జనవరి ఒకటి నుండి మూడో తేదీ వరకు ప్రముఖులతో వివిధ అంశాలపై ఏకకాలంలో 13 సెమినార్లు నిర్వహించారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది ప్రతినిధులు లైబ్రరీ కాంగ్రెస్ కు ప్రతినిధులుగా హాజరయ్యారన్నారు. కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు అనేకమంది మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, కవులు, కళాకారులు పాల్గొన్నారన్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అత్యంత జయప్రదంగా నిర్వహించారని తెలిపారు.

నిరసన చేపడుతున్న బాధితురాలు, అప్పలరాజు

పింఛను నిలుపుదలపై నిరసన

ప్రజాశక్తి-యస్.రాయవరం:పింఛను నిలుపుదలపై మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన కొండ్రపు బంగారమ్మ గ్రామ సచివాలయం వద్ద నిరసన చేపట్టింది. స్పందించిన ఎంపీడీవో రామచంద్రమూర్తి ఆమె వద్దకు వచ్చి ఫిబ్రవరి నుంచి పెన్షన్ ఇస్తామని, ఉన్నత అధికారులకు తెలియచేశారని, దీక్ష విరమించాలని కోరారు. ఈ సందర్భంగా కొండ్రపు బంగారమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, పెన్షన్ ఇప్పించాలని గత 16 నెలలుగా అధికారులను కోరుతున్నానన్నారు. ఏ ఆధారం లేక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ మందులకు కూడా డబ్బులు లేక తీవ్రంగా అవస్థలు పడుతున్నానని తెలిపారు. అనంతరం కొండ్రపు బంగారమ్మకు ఎంపీడీవో రామచంద్రమూర్తి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు.తనకు ఇంతటి సహకారం అందించిన సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం అప్పలరాజుకు బంగారమ్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

'సెబ్'లో మార్పులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా పరిధిలోని కొన్ని సెబ్ స్టేషన్ల పరిధి మారిందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నగరంలోని సెబ్ స్టేషన్‌లలో కొన్ని మార్పులు జరిగాయన్నారు. అందులో భాగంగా నగర పరిధిలోని నాలుగు సెబ్ స్టేషన్ స్థానంలో మూడు స్టేషన్లు పనిచేయనున్నాయని తెలిపారు. జిల్లాలో ఏడు స్టేషన్ల స్థానంలో ఆరు స్టేషన్లు ఉంటాయన్నారు. సర్కిల్ వన్ పరిధిలోని రెల్లి వీధి, హార్బర్ తదితర ప్రాంతాలు మహారాణి పేట పరిధిలోకి వచ్చాయన్నారు.

సిఐటియు రాష్ట్ర కమిటీలో..

విశాఖ, అనకాపల్లి జిల్లాల నేతలకు చోటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి : భీమవరంలో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో చివరి రోజు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో విశాఖ జిల్లా నుంచి కెఎం.శ్రీనివాసరావు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఆర్‌కెఎస్‌వి కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పి.మణి, పి.వెంకటరెడ్డి, యు.రామస్వామి, బి.జగన్, ఎస్.జ్యోతీశ్వర రావు, యు.రాజు, టి.నూకరాజు రాష్ట్ర కమిటీ సభ్యులుగా, కెఎం.కుమారమంగళం, పి.అనసూయ, జి.శ్రీనివాస్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే, అనకాపల్లి జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా రుత్తల శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, మజ్జి నాగశేషు, గూనూరు వరలక్ష్మి, సిహెచ్ రూపాదేవి ఎన్నికయ్యారు. వారికి ఇరు జిల్లాల కమిటీల నుంచి పలువురు అభినందనలు తెలిపారు.

కెఎం.శ్రీనివాసరావు | ఆర్‌కెఎస్‌వి.కుమార్ | జి.కోటేశ్వరరావు

పాడి రైతుల పెన్నిధి.. తులసీరావు

సంతాప సభలో పలువురు వక్తలు

తులసీరావు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి:విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు పాడి రైతుల పాలిట కల్పవృక్షంగా నిలిచారని, అటువంటి వ్యక్తి మృతి చెందడం పాడి రైతులను కలచివేస్తుందని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని తుమ్మపాల మెయిన్ రోడ్‌లో ఎంపీటీసీ సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి ఆధ్వర్యంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తులసీరావు అంచలంచలుగా ఎదిగి రాజకీయాలని శాసించే స్థాయికి చేరుకున్నారన్నారు. పాడి రైతుల కుటుంబాలకు విద్య, వైద్యం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, గ్రామాల్లో సాగునీటి వనరులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, నడిపల్లి గణేశ్వరరావు, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పిడి గాంధీ, వైసిపి సీనియర్ నాయకులు పడాల గణపతి రావు, మార్టూరు అజయ్, నడిపల్లి బోసుబాబు, పన్నీరు వెంకటరమణ, ఆర్టీసీ సత్యనారాయణ, గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : తులసీరావు మరణం పాడి రైతులకు తీరని లోటు అని స్థానిక పాల కేంద్రం అధ్యక్షులు మళ్ల సంజీవరావు, సెక్రటరీ పెంటకోట సత్యనారాయణ అన్నారు. పాలకేంద్రం ఆవరణలో గురువారం తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డెయిరీ నిధులతో మారుమూల ప్రాంతాలకు రహదారులు, కళ్యాణ మండపాలు, కళా వేదికలు నిర్మించారని తెలిపారు. వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, ఆధ్వర్యంలో ఆయా పాల కేంద్రాల వద్ద తులసీరావుకు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాలలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉపయ సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మునగపాకలో..

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు చిత్ర పటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, గొల్లవిల్లి నానాజీ, గొల్లివిల్లి బాబురావు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపల్ చైర్పర్సన్ ఆదిలక్ష్మి తులసీరావుకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తులసీరావు ఆంధ్ర కురియన్‌గా పేరు గాంచారన్నారు. ఏకధాటిగా 37 ఏళ్ళ పాటు పాడి పరిశ్రమలోనే చరిత్ర సృష్టించి పాడి రైతుల అభ్యున్నతి కోసం అహర్నిశలూ కృషి చేశారన్నారు. తులసీరావు మృతి సమాజానికి తీరని లోటు అన్నారు. తులసీరావుతో వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

తులసీరావు మృతి పాడి రైతులకు తీరని లోటు

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి చెందడం పాడి రైతులకు తీరని లోటు అని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. అప్పారావుతో పాటు కౌలు రైతు సంఘం నాయకులు రాము, ఆళ్ల మహేశ్వరరావు తదితరులు గురువారం తులసీరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తులసీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కర్రి అప్పారావు మాట్లాడుతూ పాల రైతుల సంక్షేమానికి, డెయిరీ అభివృద్ధికి తులసీరావు 40 సంవత్సరాలుగా విరామం లేకుండా కృషి చేశారని కొనియాడారు. ప్రైవేట్ డెయిరీలతో పోటీపడి రాష్ట్రంలో విశాఖ డెయిరీని ఉన్నతమైన స్థానానికి తీసుకొచ్చారని తెలిపారు. రైతుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అలాగే రాజకీయాలకు అతీతంగా మండలానికి చెందిన అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, పాల సంఘం అధ్యక్షులు, నాయకులు, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు తదితరులు తులసీరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల

'మిస్సింగ్' జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, టాటా ఏస్ (మినీ వ్యాన్) డ్రైవర్లకు, డే అండ్ నైట్ ప్యాకేజీ, పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న మిస్సింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు కోరారు. గురువారం సాయంత్రం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సిఎంఒహెచ్‌కు ఈ మేరకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక జోన్ పరిధిలో 2021 ఆగస్టు నుంచి 2022 డిసెంబర్ వరకు ప్రతి నెలా, ఏదో ఒక వార్డులో ఒకరు లేదా ఇద్దరు కార్మికులకు జీతాలు మిస్ అవుతూ వచ్చాయన్నారు. నేటికి ఆ సంఖ్య 70 మంది వరకు చేరిందన్నారు. 88వ వార్డులో 11 మందికి, 65 వార్డులో 45 మందికి జీతాలు రాలేదన్నారు. 67, 70, 74, 75, 77, 79, 85, 87 వార్డులలో ఒక్కొక్కరు, ఇద్దరు చొప్పున జీతాలు రాలేదన్నారు. ఈ విషయంపై తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నక్క నాగరాజు, మీనాక్షి, వెంకటరావు, దుర్గ, సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాలలో స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయకపోతే ఐటిడిఎను ముట్టడిస్తామని గిరిజన విద్యార్థి సంఘం (జిఎస్‌యు) నాయకుడు వెచ్చంగి నానిబాబు హెచ్చరించారు. అల్లూరి జిల్లాలో జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిఎస్‌యు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలన్ని 100శాతం స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలన్న రిజర్వేషన్‌కు సంబంధించిన జిఒ-3 రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ పెండింగ్ లో ఉన్నప్పటికీ జిల్లాలో జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఉద్యోగ నియామకల్లోనూ 98 పోస్టులకు గాను, 26 పోస్టులు మాత్రమే గిరిజనులతో భర్తీ చేసి మిగతా పోస్టులన్నీ గిరిజనేతరులతో భర్తీ చేశారని తెలిపారు.